"హల్లో... అభినవ్ మమ్మీగారే కదండీ?"

"అవును. మీరు...?"


"నేను సుధాకర్‌ని... అభినవ్‌తో కలసి పని చేసే ఉద్యోగిని..."

"ఏమిటి... విశేషం... మా బాబు బాగున్నాడా?" ఎందుకో సుజాత గుండెలు గుభేలుమన్నాయి.

"ఆంటీ... మీరు కంగారు పడతారేమో... అంకుల్ లేరా?"

"లేరు... చెప్పు బాబూ... ఏమైంది...' సుజాతకి చెప్పలేనంత గాబరా... ఆందోళన.

"గత వారం రోజులుగా అభి చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉన్నాడు. డాక్టర్‌కి చూపిస్తే అతను డిప్రెసివ్ సైకోసిస్ అనే మానసిక రుగ్మతకి గురయ్యాడన్నారు... ప్రవర్తన అదోలా ఉంది... మీకు తెలియజేద్దామంటే అభి ఫోన్ నెంబరు ఇవ్వలేదు... ఈ రోజే ఆఫీస్ రికార్డ్ నుంచి నెంబరు తీసుకుని మీకు తెలియజేస్తున్నాను.



# రెక్కసోసి

నాకు చాలా భయంగా ఉంది. అంటీ... మీరు త్వరగా రావాలి..."

"మేము... మేము... వెంటనే వస్తాము..." అంతకన్నా ఏం చెప్పా మన్నా సుజాత మాట్లాడలేకపోయింది. కళ్ళ వెంట ఏకధారగా కన్నీరు కారిపోతోంది. అటునించి ఫోన్ కట్ అయింది.

అప్పుడే సుజాత భర్త రవి వచ్చేడు. అప్రయత్నంగా అతడిని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ విషయమంతా చెప్పింది. లోలోన రవి కూడా ఆందోళన పడుతున్నా భార్యకి నచ్చజెప్పే ప్రయత్నం చేసాడు.

"అందుకే... సుజీ... వారం రోజుల నుంచి వాడు ఫోన్ చేయడం లేదు... నేను వాడు పనిలో బీజీగా ఉన్నాడేమో అనుకున్నా... గాబరా పడకు...మనం ఇప్పడే బస్సులో బయలుదేరుదాం..." అన్నాడు రవి.

అభి హైద్రాబాద్ వెళ్ళే ముందురోజు రవి చాలా సీరియస్‌గా అన్నాడు, "అభి... నా చిన్ననాటి స్నేహితుడు నాగరాజ్... నీకు తెలుసు కదా... అమెరికాలో సెటిల్ అయి పదేళ్ళయింది... అక్కడే ఏదో కంపెనీ పెట్టేడు... నిన్ను తన వద్దకు పంపించమన్నాడు" అభినవ్ ఏమీ మాట్లాడలేదు.

"అవును బాబూ... నువ్వు అమెరికాలో జాబ్ చేస్తే మాకూ ఎంతో గర్వంగా ఉంటుంది" సుజాత స్వరం. అభి అన్యమనస్కంగా "సరే... ఆలోచిస్తాను" అని ఆ రెండో రోజే హైద్రాబాద్ వెళ్ళిపోయాడు.

"ఏమండీ... వెళ్దామండీ..." సుజాత బొంగురుపోయిన కంఠస్వరం...

"నాకూ ఎందుకో భయంగా ఉంది సుజీ..."

ఆదరాబాదరా రాత్రి 10 గం.లకు హైద్రాబాద్ బస్సు ఎక్కారు ఆ దంపతులిద్దరూ.

రవి సుజాతలకి ఒక్కగానొక్క కొడుకు అభినవ్. ఎంతో అల్లారు ముద్దుగా పెంచారు. చిన్ననాటి నుంచి అభినవ్ చదువులో ఎప్పుడూ ఫస్టే. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తిచేసి హైద్రాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఇంజనీర్‌గా చేరి ఏడాది పూర్తయింది.

రవి స్టేట్‌బ్యాంక్‌లో ఎకౌంట్స్ ఆఫీసర్. సుజాత గవర్నమెంట్ హైస్కూల్లో టీచర్. వారు విశాఖపట్నం మధురవాడలో స్వంత ఇల్లు కట్టుకున్నారు. జీవితం చాలా హాయిగా గడుస్తోంది.

అభినవ్ మెట్రిక్ ర్యాంక్‌లో వచ్చాక వారిరువురికీ ఒక కోరిక బలపడింది. ఇరుగు పొరుగు పిల్లలలాగే వాళ్ళ అబ్బాయి కూడా విదేశాలలో జాబ్ చెయ్యాలని. కాని ఎన్నిసార్లు చెప్పినా అభి ఎప్పుడూ దాని గురించి పట్టించుకోలేదు.

అయినా సుజాత, రవి ఆశ వదలుకోలేదు. ఏదో రోజు తప్పక వస్తుంది... అభి కూడా

**బుద్ధరాజు లక్ష్మీనరసింహారావు**

స్టేట్స్‌కి వెళ్తాడు... అనుకుని సంతృప్తిపడేవారు.

ఉదయం సరిగ్గా సమయానికే బస్సు హైద్రాబాద్ చేరుకుంది. బస్టాప్‌లో దిగి ఆటో ఎక్కారు రవి, సుజాత.

మధురానగర్‌లో ఓ చిన్నఇల్లు అద్దెకు తీసుకుని అభినవ్ ఉంటున్నాడు. కంపెనీవారు దాని అద్దె ఇస్తారు. తను ప్రొద్దున్నే డ్యూటీకి వెళ్తే ఏ అర్ధరాత్రో అయ్యేది తిరిగి వచ్చేసరికి. అందుకే వాళ్ళ కంపెనీ క్యాంటీన్‌లోనే టిఫిన్, భోజనం ఎరేంజ్ చేసుకున్నాడు. డ్యూటీకి వెళ్ళి రావడానికి కంపెనీవాళ్ళే మోటర్‌సైకిల్ ఇచ్చారు.

"అదేసార్... మీరు చెప్పిన ఇల్లు..." ఆటోవాడి స్వరం విని ఉలిక్కిపడ్డారు రవి, సుజాత. మీటర్ చూసి ఆటోవాడికి డబ్బిచ్చి ఇద్దరూ లోపలికి నడిచారు.

అంతే!

గతుక్కుమన్నారు. వారిరువురికీ భూమి గుండ్రంగా తిరుగుతున్నట్లయింది.

అభి ఇంటి చుట్టూ జనం... పోలీసు బలగం...! ఏమయింది?

ఏమై ఉంటుంది...?

అంతలో ఓ పోలీస్ ఆఫీసర్ వారి దగ్గరగా వచ్చాడు. "మీరు... అభినవ్ ఫాదర్, మదర్ కదూ?"

"అవునుసార్... ఏమయింది...?" ఇద్దరూ ఒకేసారి ఖంగారుగా అడిగారు.

"ప్లీజ్ హావ్ పేషెన్స్... రండి...!"

"ఏమండీ... ఏదో అయిందండీ... మన బాబుకి ఏదో అయింది" సుజాత కంఠం బొంగురుపోయింది. కన్నీరు ఆగడం లేదు.

"తొందరపడకు సుజీ..." అలా అన్నాడే గాని రవి గుండెలు కూడా వేగంగా కొట్టుకుంటున్నాయి. హడావిడిగా ఆ పోలీస్ అధికారి వెనక అభి రూమ్‌లోకి వచ్చారు.

అంతే...!

గాలి స్తంభించిపోయింది. బెడ్ మీద తల దాకా తెల్ల దుప్పటి చుట్టిన ఒక...!

"అభీ... !!" సుజాత దిశలు దద్దరిల్లేలా గావుకేక పెట్టి కుప్పగా కూలిపోయింది. రవి వణకుతూనే ఆమెని పట్టుకోబోయాడు. కానీ లాభంలేకపోయింది.

అంతలో అక్కడే ఉన్న డాక్టరు, ఎటెండర్లు ఆమెని పక్క గదిలోకి తీసుకువెళ్ళిపోయారు.

పోలీస్ సిబ్బంది, ఫొటోగ్రాఫర్లు వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటున్నారు.

"అభినవ్ సూసైడ్ చేసుకున్నాడు!"

"నోనో..." రవి బిగ్గరగా అరిచాడు, "అలా జరిగే ఆస్కారం లేదు... ఏదో పొరపాటు... ఎవరో ఏదో చేసారు..."

"సారీ... ఇదిగో అతని సూసైడ్ నోట్. దస్తూరి మీ అబ్బాయిదేనా...? చూడండి... మాతో సహకరించండి" రవి పిచ్చివాడిలా కంట్లో నీరునిండి ఉన్నా ఆత్రుతగా అభి దస్తూరి చూస్తున్నాడు...

"నా స్వంత కారణాల వల్ల నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. దీనికి నేను తప్ప ఎవ్వరూ బాధ్యులు కారు".

ఇట్లు
అభినవ్

"దీనితో పాటు మీ ఇరువురి పేరునా ఓ కవరు కూడా ఉంది... టేకిట్!" అని ఆ పోలీస్

ఆఫీసర్ ఓ కవరు రవి చేతికందించాడు.

రవి మతి చలించిన వాడిలా గుడ్లప్పగించి అభి బెడ్ వైపే చూస్తున్నాడు.

"సారీ సార్... ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థమవ్వని సమయమిది. అయినా మీరు ధైర్యంగా ఉండి మీ మిసెస్‌ని జాగ్రత్తగా చూసుకోండి... ఆమె బాగా షాక్ అయినట్లున్నారు. మా పని పూర్తి చేసుకుని పోస్ట్‌మార్టం తర్వాత మీకు..."

రవి కళ్ళ వెంట ఏకధారగా కన్నీరు! ఏమీ వినిపించడం లేదు. అంతా గందరగోళంగా ఉంది. అయినా ఆత్రుతగా వణుకుతున్న చేతులతో ఆ కవరు విప్పాడు. అది త్వరగా చదివేస్తే దూర తీరాలకు వెళ్ళిపోయిన ఒక్కగానొక్క కొడుకు అభి తిరిగి వచ్చేస్తాడేమో అనే పిచ్చి వ్యామోహం!

ఉత్తరం రవి కన్నీరుతో తడిసిపోతోంది... అక్షరాలు మసక మసకగా కనిపిస్తున్నాయి...

*నా ఆరాధ్యులైన నాన్నా, అమ్మా...!*

చివరిసారిగా పాదాభివందనం.

మిమ్మల్నిలా ఒంటరిగా వదలి వెళ్ళి పోతున్నందుకు చాలా బాధగా ఉంది. కాని... నేను మీకు ఈ జన్మలో నా ముఖం చూపించే ధైర్యం చాలక... వెళ్ళిపోతున్నాను... నన్ను మనసారా క్షమించండి. విదేశాలకి వెళ్ళాలన్న మీ కోరిక తీర్చలేను...

ప్రతీ మానవుడికీ కొన్ని స్వంత కోరికలు, ఆశయాలు, కలలూ ఉంటాయి... అవి తీరుతాయో లేదో మనకి తెలియదు.

అమ్మా... వారం రోజుల నుంచి ఏమీ తినలేదు. అసలు తినాలనిపించలేదు. వారం రోజులుగా అసలు పనిలో మనసు లగ్నం చేయలేక... ఏవేవో పిచ్చి ఆలోచనలు... నాకు తెలియకుండానే డిప్రెషన్ అనే రాక్షసుడు నాలో చోటు చేసుకున్నాడు...

హైస్కూల్ పాస్ అయిన దగ్గర నుంచి మీ ఇద్దరూ వారానికి ఒకసారయినా నేను విదేశాలకి వెళ్ళాలి, మంచి ఉద్యోగం చేయాలి, అందరికీ గొప్పగా చెప్పుకోవాలని తపించి పోయేవారు. నేను పట్టించుకోకపోయినా అవి నా సబ్‌కాన్షస్ మైండ్‌లో రిజిష్టర్ అయిపోయాయి. బహుశా అప్పటి నుంచే ఇంటర్నల్ డిప్రెషన్ చోటు చేసుకుని ఉంటుంది.

మీరు అనుకున్నట్లు బాగా చదువుకుని విదేశాలకి ఉద్యోగాలకి వెళ్ళడం... చాలా గొప్ప విషయం అయి ఉండవచ్చు... కానీ నాన్నా... విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్న ప్రతీ ఒక్కడూ అక్కడ కష్టాలకి, బాధలకి గురవకుండా సుఖంగా ఉన్నాడనుకోవడం పొరబాటు అని నా అభిప్రాయం.

మా అబ్బాయో, అమ్మాయో ఫలానా దేశంలో ఉన్నారంటే ఎంత స్టేటస్ పెరుగుతుందో నాకు తెలియదు.

నేనేం చేయను చెప్పండి... నేను మీకు ఒక్కగానొక్క కొడుకుని. నా చిన్నతనం నుంచి నన్ను వేలు పట్టుకుని నడిపించిన మిమ్మల్ని జీవితాంతం జాగ్రత్తగా చూసుకోవడం నా బాధ్యత, నా ధర్మం కాదా? మీకు దూరంగా ఉండి... మీ కష్టసుఖాలలో మీ దగ్గరికి రావాలన్నా రాలేని జీవితం ఎందుకు?

మన దేశంలో ఏ చిన్న ఉద్యోగమో, వ్యాపారమో, కూలిపనో చేసుకుని తల్లితండ్రులను జీవితాంతం జాగ్రత్తగా చూసుకుంటే నా జీవితం ధన్యమవుతుందనుకున్నాను. కాని మిమ్మల్ని

దగాచేసి వెళ్ళిపోతున్నాను. అంతా అయోమయ స్థితి... డిప్రెషన్ అనే రాక్షసుడు నన్ను బ్రతకనీయడు.

ఇక మన ఇండియాలో ఉద్యోగాల సంగతి... ఈ కాలంలో మనిషిలో ఉండే భావాలకు ఆత్మీయతకు, అనురాగాలకు తావులేదు... అంతా డబ్బుమయం...

గవర్నమెంట్ జాబ్స్... హు!! పని నిదానంగా... రిలాక్స్‌గా చేయండి... అసలు పని చేయకపోయినా పర్వాలేదు... జీతం టైమ్‌కి దొరుకుతుంది... లేదా ట్రేడ్ యూనియన్లున్నాయి... సమ్మెలు అండగా ఉన్నాయి. అందుకే పుట్టగొడుగుల్లా ప్రైవేటు సంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి నిరుద్యోగ సమస్య తీరుస్తున్నామని తక్కువ జీతానికి గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నాయి. ఇక్కడ యూనియన్లు లేవు రక్షించడానికి. లాభాలుంటే జీతాలు... లేదా... దైవాధీనం.

నా విషయం చూడండి. 6 నెల్లక్రితం కంపెనీ చాలా బాగా పనిచేసి, లాభం వస్తే ఛైర్మన్‌గారు నన్ను అభినందించి, సభలో సన్మానం చేసారు. గత వారం రోజులుగా నా మనసు బాగులేక కొన్ని పొరబాట్లు జరిగాయి. దానివల్ల కంపెనీకి కాస్త నష్టమొచ్చింది.

అంతే...!

నేనెంత చెప్పినా వినకుండా నన్నూ, నా మానసిక స్థితినీ అర్థంచేసుకోకుండా వారం రోజుల క్రితం ఛైర్మన్‌గారు అందరి ముందూ కేకలూ, చివాట్లూ, అసభ్యకరమైన మాటలూ, బూతులూ... వినడానికీ చెప్పడానికీ అసహ్యం



హైదరాబాద్ శ్రీ త్యాగరాయగానసభలో మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయగానసభల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభలో స్వాతి శ్రీపాద రచించిన కవితల సంపుటి 'మనసుకు చూపుంటే' ని ఆవిష్కరిస్తున్న పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో మానస రఘుశ్రీ, దీక్షితులు, డా॥ వాసా ప్రభావతి, స్వాతి, శరత్ జ్యోత్స్నారాణి ఉన్నారు.

... నా పై అధికార్లెవరూ కిక్కురుమనలేదు... నన్ను డిఫెండ్ చేయలేదు.

ఆ సమయంలో ఎర్రగా కంద గడ్డలా ఉన్న ఛైర్మన్‌గారి మోహం చూస్తే... చాలా... చాలా... చెప్పలేను.

డబ్బు కోసం చదువు, సంస్కారం విడిచి పెట్టిన భారతీయుడు ఆయన... ఈ కాలంలో డబ్బే గొప్పది... డబ్బే సర్వస్వం.

ఆ తర్వాత వంటరిగా చాలాసేపు ఏడ్చాను. అమ్మా... నీవూ నాన్నా బాగా గుర్తుకొచ్చారు. మిమ్మల్ని గట్టిగా కౌగిలించుకోవాలనిపించింది ... కానీ... మీ వద్దకు రాలేను. నన్ను విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడని గర్వంగా చెప్పకోవాలనుకునే మీకు... మన దేశంలోనే అవమానం చెందిన ఈ ముఖం ఎలా చూపించను?... నాకు ఆ ధైర్యమే లేదు.

రకరకాల ఆలోచనలతో సుడిగుండంలో ఉన్నట్లుంది. నాకేదో అవుతోంది... అప్పుడే మంచి సమయమని నాలో దాగి ఉన్న డిప్రెషన్ అనే రాక్షసుడు ఉగ్రరూపం దాల్చాడు... నా మనసుని కుమ్మేసాడు...

విదేశాలకి వెళ్ళి అమ్మా నాన్నలకు గర్వ కారణం అవలేకపోయాను... ఈ దేశంలో ఉండి మీకు సేవ చేస్తే జీవితం ధన్యమనుకున్నా... అదీకాక ఇక్కడ జరిగిన అవమానం తలెత్తుకోనీయడంలేదు... ఎటు చూసినా గాఢాంధకారం. ఆ రోజు నుంచే బాగా డ్రగ్స్ తీసుకుంటున్నాను...

ఇక ఈ బాధ భరించలేకుండా ఉన్నాను... అదిగో రాక్షసుడు బిగ్గరగా అరుస్తున్నాడు... అట్టహాసం చేస్తూ దూరంగా పారిపోమంటున్నాడు...

ఫోన్‌లో మాట్లాడేటపుడు గట్టిగా అరిచి మాట్లాడడం కొందరికి అలవాటు. ముఖ్యంగా మొబైల్‌లో - పబ్లిక్ ప్రదేశంలో ఉన్నప్పుడు ఈ అలవాటుని మానుకోవాలి. పైగా గట్టిగా అరిచి మాట్లాడడం కంటే మామూలు స్థాయిలో మాట్లాడడం వల్లనే అవతలి వారికి మన మాట స్పష్టంగా వినబడుతుందని గమనించండి.

(ఏ మొబైల్ ఫోన్ ఇన్‌స్ట్రుమెంట్‌లోనూ మైక్‌ని సరాసరి నోటి దగ్గర పెట్టుకొని మాట్లాడవలసిన అవసరం ఉండనే ఉండదని కూడా గుర్తుంచుకోండి).

మరి వస్తా.

అమ్మా... నన్ను మనసారా క్షమించి ఒక్కసారి నీ కౌగిలిలోకి తీసుకో...

ఈ మనోవ్యధ నుంచి బయట పడాలంటే ఇదే ఒక మార్గమనిపించి.... ఆ రాక్షసుడు... నాలో దాగి ఉన్న రాక్షసుడితో పోరాడాలని పురుగుల మందు బాగా త్రాగేసాను...

నాన్నా... క్షమించమని అడగను... నన్ను ఎన్నడూ కొట్టలేదు కదా... చాచి ఒక్క చెంప దెబ్బ కొట్టండి... అదిగో రాక్షసుడు... అట్టహాసం... చాలా దగ్గరగా వచ్చేస్తున్నాడు... మరి టైమ్ లేదు... వెళ్తాను...

నాన్నా అమ్మా! మీరు జాగ్రత్త... మళ్ళీ వస్తాను కదా... ప్రామిస్!

ఎప్పటికైనా మీ వద్దకే వస్తాను.

మీ... ప్రియమైన అభి.

"బా...బూ... !!!" ఆకాశం దద్దరిల్లేలా బిగ్గరగా అరచి నేలపై కుప్ప కూలిపోయాడు రవి. ●